అన్నదమ్ములు

'అబ్బబ్బ! ఒక్క నిముషంకూడా నేనిక్కడ వుండలేను!...'

'ఏమిటట్లా రుసరుసలాడి పోతావు. అత్తే చూస్తుంటే...'

'అంతే లే, నేనంటమే కనిపిస్తుందిగాని, ఇంట్లో యేమిటి జరుగుతోందో, నువ్వుపట్టించుకుంటేగా!...'

'ఏమి టయింది చెప్పమంటుంటే, ఏమి టాసోది పూరికే!...' కస్సుమన్నాడు రాఘవులు.

'మంగి తేరగావుందిగా! ప్రతిపనికీ మంగి, మంగి అని నావెంట పడటం. ఆమె మాత్రం, కూర్చున్న చోటునుంచి కదలకూడదు...ఓ

మూల బుడ్డాడేమొ చంక దిగడాయె! అన్నింటికీ నేనే కావాలేంటి...పోనీ బావ చెప్పతాడూ...'

'మా అన్నయ్యను యేమీ అనక. చాల మంచివాడు...'

'అవున్లేవయ్యా, మీ అన్నయ్యా మంచివాడు. మా అక్కయ్యా మంచిదే. నడాన, నువ్వూ, నేనూ చెడ్డాళ్ళం. అంతేగా!

'అసలు నీకేం వచ్చిందో చెప్పరాదూ...'

'నాకేంరాలా! ...ఓమాటడగనా!... సంక్రాంతి పండగ గందా, నాకొక్క చీరె కొనిపెట్టావు! బుడ్డాడికి ఒక్క చొక్కాన్నా తెచ్చావు? ఎందుకొచ్చిన చాకిరీ అంట!...ఈరొచ్చులో వుండి, నేను దాసీ దానిలాగ పని చెయ్యటమూనూ, నువ్వేమొ రెక్కలు విరుచుకోవటమూ యెందు కంట! మనయిల్లు మనం చూసుకోలేమా! ఈ నెల బావ, యేమాత్రం తెచ్చాడు. ఆమె యేంపనిచేసింది...కూటికి లేనప్పుడూ చచ్చేటట్టు పని చేశాము. ఇయ్యాల, కొంచెం సంపాదిస్తున్నాం గదా అనుకుంటే, ఆ అను భవం లేకపోయె! పైగా మనిద్దరికి ఆ బండచాకిరీ తప్పకపోయె!...నువ్వూ ఆలోచించు, నేను అన్నాననికాదు...' మంగి రాఘవులు మొహంలోకి ఆలోచనగా చూసింది.

రాఘవులు యేమీ సమాధానం చెప్పలేక పోయాడు. రాఘవులుకు తెలుసు, మంగి అన్న మాటల్లోగల సత్యం. తాము కొనుక్కున్న కొత్త రిక్షాలో తనసత్తువ యెంతుందో తనకు బాగా తెలుసు. తాము కట్టుకున్న పూరింటికి తాను యెంతశ్రమ పడ్డాదో మరచిపోలేదు. ఎవరికోసం యీశ్రమ, యెందుకోసం యీబాధ అని యెన్నడూ రాఘవులు ఆలోచించ లేదు. తన కష్టార్జితం, యింకోళ్ళపాలవుతోందని కూడా యెప్పుడూ

వూహించలేదు. తన జీవితం వర్ధించిన విస్తరికాదు. తాను కష్టంచేసి బ్రతకాలి. ఈ సత్యాన్ని రాఘవులు పూర్తిగా గుర్తించాడు. తాను శ్రమ పడుతున్నప్పుడు కూడా, యింకోళ్లు తన శ్రమ ఫలితం అనుభవిస్తున్నారనే భావనే కలగలేదు. అందువల్లనే తాను అన్నతో పాటు యీవూరు వచ్చినప్పుడు, మనం యెట్లా బ్రతకటం, యెట్లా సంపాదించటం, యెట్లా జీవించటం, యివే సమస్యలు యిద్దర్నీ బాధపెట్టినాయి. బండ రాళ్లను ముక్కలు ముక్కలుగా చేశారు. దుంగ కొయ్యల్ని బద్దలు బద్దలుగా చీల్చారు. ధరిత్రిని స్వేద బిందువులతో తడిపి, నారుపోసి పెంచారు. నిలువు ఎండలో కడుపులు మాడ్చుకుని కట్టిన పునాదుల మీదనుంచి భవనాలు లేచినాయి, రెక్కలు ముక్కలు చేసుకుని నాగలిపట్టిన పొలం నవ్వింది. అదంతా యితరుల సొమ్ము. సోము, రాఘవులు తీవ్రంగా ఆలోచించుకున్నారు. దీనికి అంతం మేమిటి. మనశ్రమ మనకు అక్కరకు రావటంలేదు. ఇతరులకోసం, మన రక్తం ధారపోయటం యెందుకు? ఎంతసేపు ఆలోచించినా, యీ సమాజ వ్యవస్థయొక్క అంతుచిక్క లేదు. వాళ్లు బ్రతకాలి, దీనికోసం యేంచెయ్యాలి? ఇదే ఆలోచన. ఎంత కష్టపడ్డా తిండికే సరిపోవటం లేదు. బ్రహ్మ ప్రళయంగా వరదలు వచ్చి, పంటలన్నీ నాశనమయితే, నీటిచుక్క లేక పోసిన నారు, మల మలమాడి పోతేయేం, యెట్లాగైతేనేం, తామున్న చోట తమకు తిండి దొరకదనే పొట్టల్ని చేత పట్టుకుని, దేశం మీదపడ్డారు. రక రకాల పనుల్లో తరతమ భేదాలుగా, తమరక్తాన్ని ధార పోయటమే. దీంట్లో సుఖం లేదు, శాంతి లేదు. దీనికీ ఒక తుదంటూ లేదు, యౌవనాన్ని వెనక్కునెట్టేసి, కాలం ముందుకు పరుగెత్తుకు పోతుందని యిద్దరికీ తెలుసు. యౌవనంలో అనుభవించవలసిన సుఖాన్ని బలిచేసుకున్న తర్వాత, యింకామనుగడే అనవసరం అని కూడా వాళ్ళిద్దరూ గ్రహించారు. ఇలాంటి ఆలోచనలు వాళ్ళి

ద్దర్ని తీవ్రంగా కలవరపరిచినాయి. ఎట్లాగైనా, తమసొత్తంటూ ఒకటి యేర్పడాలి. అంతవరకు అవిరళంగా కృషి చెయ్యాలి. దానితర్వాత అన్ని సమస్యలు వాటంతట అవే చక్కపడతాయని అనుకున్నారు. పగలనక, రాత్రనక, తమరక్తం అంతా ధారపోసి తాము లాగుతున్న రిక్షాను, యజమానికి యిచ్చేసి, కొత్తరిక్షాను కొనేశారు. ఇప్పుడు యజమానికి, తమరక్తంలో, భాగం యివ్వక్కర్లేదు. ఒకవారం, పగలల్లా సోము రిక్షాను తీసుకు పోతే, రాత్రిపూట రాఘవులు తీసుకుపోతాడు వంతుల ప్రకారం. యిద్దరూ రిక్షా చక్రాల్ని తిప్పే శేస్తున్నారు ఎక్కడో వూరిబైట. చౌకగా కొంచెంగా స్థలం కొనుక్కొని, ఓపూరిగుడిసె వేసుకున్నారు. ఇల్లొచ్చింది. ఇల్లాలురావాలి. సోముపెళ్లి చేసుకున్న కొద్ది నెలల్లోనే రాఘవులూ పెళ్ళిచేసుకున్నాడు. తమల్ని పీల్చిపిప్పిచేసిన రిక్షా యజమానికి పోటీగా నిలబడ్డారు యిద్దరు అన్నదమ్ములూను! ఒక వస్తువును, తమ సొత్తు చేసుకోవటంలో వుండే సాధకబాధకాలు యిద్దరికీ పూర్తిగా అర్థమయినాయి. సోము, రాఘవులు, అప్పుడప్పుడు, తమ గతచరిత్రంతా జ్ఞాపకం తెచ్చుకుంటూ, విచారిస్తూ వుంటారు? తోడుకోడళ్ళిద్దరు కళకళలాడుతు యింట్లో తిరుగుతూవుంటే అన్నదమ్ములిద్దరు ఆశలు, చిగిరించి, పుష్పించి, కాయలుకాసినట్లు సంతోష పడుతున్నారు. సోముకూ మగపిల్లాడే, రాఘవులకూ మగపిల్లాడే!

ఇప్పుడిప్పుడే, రిక్షాను అద్దెకు యివ్వటం కూడా మొదలు పెట్టారు అయితే రాబడి పూర్తిగా తగ్గిపోతోందని తెలిసినతర్వాత, శరీరం కష్టపడితే కాసి, డబ్బురాదని తెలుసుకున్నారు. ఇద్దరు అన్నదమ్ములల్లా ఆరుగురయ్యేటప్పటికి, మన స్తత్వాలు విభిన్నంగా కనిపించటం మొదలు పెట్టినాయి. దృక్పథాలు మారటం మొదలు పెట్టినాయి. లెక్కలకు విలువ

వచ్చింది. తన, మన అనేభావం, ఒకరికి తెలియకుండా ఒకరికి పెరిగి పోయింది. అన్నదమ్ములు ముభావంగా వూరుకుంటున్నారు. తోడికోడళ్ళు రచ్చ కెక్కుతున్నారు. శాంతి సంతోషం, యెవరి మనస్సుల్లో వారికి వుంటుందనే మాట అసత్యమని యిద్దరి అన్నదమ్ములకు తోచింది. తామున్న యింట్లో వుంటుంది శాంతి, సంతోషము.

నిజానికి రాఘవులు కష్టపడ్డంత సోము కష్టపడటం లేదు. ఇది యివ్వాళ రాఘవులు తెలుసుకున్న సత్యం కాదు. తాము మొదట యీ వూరు వచ్చి నప్పటినుంచి, సోముకు, రాఘవులుకు తెలిసిన విషయమే! శరీర దౌర్బల్యము వున్నా, మనోబలంచేత యిన్నాళ్ళు సోము నెట్టుకువస్తున్నాడు. సోము అండచూసుకుని రాఘవులు కండలు పెంచుకున్నాడు. అన్నసంగతి, తనకు మొదటినుంచీ తెలిసినా మంగి యీనాడు ఆలోచిస్తున్నట్లు, రాఘవులు యెన్నడు కూడా ఆలోచించలేదు. రాఘవులు తీవ్రంగా ఆలోచించుకుంటున్న కొద్దీ మంగి అంటున్న మాటల్లో సత్యం గోచరమవుతోంది. జీవితం శాశ్వతం కాదు. ఓమూలవృద్ధాప్యం ముంచుకొస్తుంది. ఇట్లా యెన్నాళ్ళు సాగిపోవటం. పిల్లాడు పెరిగి పెద్దవాడయితే, వాడు కూడా రెక్కలు విరుచుకోవాల్సిందేనా! నేను కష్టపడింది చాలదా. అయినా నేను కష్టపడింది నా కోసమేనా! నా సంతోషంకోసం కాదు! నేను కష్టపడి సంపాదించిన దంతా ఖర్చయిపోతే, నా కొడుక్కు మిగిలే దేముంటుంది? ఏ వేమిటో ఆలోచనలు పరంపరలుగా వచ్చి, రాఘవుల మనస్సు మీద దాడి చేస్తున్నాయి. ఇంట్లో పోరు. బైట శ్రమ. తనకు సుఖంలేదు. ఈ రెండూ రాఘవుల మనస్సును తీవ్రంగా పీడిస్తున్నాయి. వెంట తాము యీ వూరు మొదట వచ్చినప్పుడు, తన అన్న, తాను యే విధంగా

వున్నారో, ఆ దృశ్యాలన్నీ కళ్ళల్లోకి వచ్చి నాట్య మాడేవి. వెంటనే దులపరించుకుని, రిక్షా యెత్తుకుని వెళ్ళిపోయేవాడు.

అనాడు రాఘవులు యింటికి వచ్చేటప్పటికి యింట్లో ఘర్షణ పడు తున్నట్లు మాటలు వినిపించినాయి. చప్పున వచ్చినవాడు వచ్చినట్లుగానే ఆగిపోయడు.

'ఏవిటి యీ బాదింపు. చీటికి మాటికి, మంగి యేదో యేదో అంటూనే వుంటుంది. ప్రతి దానికి నేను సమాధానం చెపుతూ కూర్చో వాలి...అంతయిదా మరీ! నాలుగు డబ్బులు ఎక్కువ తెస్తున్నాడుగదా తన మొగుడని, యిష్టం వచ్చినట్లు అంటుంటే వూరుకోవడమేనా!...పోనీ రాఘవులు యేమన్నా అంటాదేమో అంటే యేమీ మాట్లాడడు...'రామి కోపాన్నంతా వెళ్ళగక్కుతోంది.

'రాఘవులను యేమీ అనక వాడు చాలా మంచివాడు...'

'అవున్లే, మీ తమ్ముడూ మంచివాడే, మా చెల్లెలు మంచిదే, మధ్యన, మనిద్దరమే చెడ్డాళ్లం...' 'అంత కూటికి లేక చస్తున్నామా!... మన యిల్లు మనం చూసుకోలేమా? యెందుకొచ్చిన తంటా అంట యిది!.. రామి, దీర్ఘంగా, సోము కళ్ళల్లోకి చూస్తూ నిలబడింది.

సోము యేమీ సమాధానం చెప్పలేక పోయాడు.

ఇంతలోకే మంగి తనపని పూర్తి చేసుకొని యింటికి వచ్చేసింది. తన భర్త మొహం చూసి చూడటంతోనే, మంగి చప్పున ఆగిపోయింది. ఏమిటి అట్లా వున్నావని అడిగింది. రాఘవులు మారు మాటాడకుండా యింట్లోకి వెళ్ళాడు. సోము రిక్షా తీసుకుని బైటకు వెళ్ళిపోయాడు.

ఒకరి మాటలు ఒకరు వినాలనేటంత బిగ్గరగా సంభాషణలు రోజు రోజుకు సాగిపోతున్నాయి. నలుగురు పెద్దవాళ్ళు నాలుగు రకాలుగా ఆలోచించుకుంటున్నారు. రాఘవులు, అన్నను పిలిచి అడుగుదా మనుకున్నాడు. సోము, తమ్ముణ్ణి అడగనే అడిగాడు. మంగివల్ల తప్పేమీలేదు, మంగి అంటున్న మాటలన్నీ నిజమే; వదినకు నువ్వు సరిగా చెప్పకపోతే మాత్రం చాలా కష్టమని కూడా రాఘవులు హెచ్చరిక చేశాడు. సోము కూడా వెంటనే అనేశాడు. మంగివల్లనే యీ భేదాభిప్రాయాలు వచ్చినాయి. ముందర మంగిని సంబాళించుకుంటే అన్నీ సమసిపోతాయని. రాఘవులుకు చర్రున కోపం వచ్చింది. సోము బాగా చిరాకు పడ్డాడు. ఇద్దరూ ఎన్నడూ అనుకోని మాటలు అనుకున్నారు. లోపల మంగి మండిపడిపోతోంది. బావ, తన పెళ్ళాన్ని వెనకేసుకు వస్తున్నాడని. రామి బుస్సు మంటోంది. రాఘవులు తన పెళ్ళాన్ని వెనకేసుకు వస్తున్నాడని. ఈ మాటలు, ఘర్షణ, రోజు రోజుకు తీవ్రరూపం దాలుస్తోంది. చివరకు పంపకాలదాకావచ్చింది. ఇంట్లో చెంబూ తప్పాలానుంచి పంచుకోవటం అయిపోయింది. ఇక యిల్లుంది, రిక్షా వుంది. ఇంటి పంపకం యెంత సేపటికి తెగలేదు. మంగి యేమి నూరిపోసిందో యేమో, రాఘవులు గట్టి పట్టే పట్టాడు. ఆ యింట్లో సగంకంటె యెక్కువ భాగం తనకు రావాలని, సోము, రామి యెన్ని చెప్పినా, ఆమాటకు వప్పుకున్నాడు, హద్దులు గీసుకున్నారు. ఎవరి స్థలంలో వారు తలొక పాక వేసుకున్నారు. ఇక రిక్షా సంగతి వచ్చేటప్పటికి పంపకాలు కుదర్లేదు. ఇద్దరికీ తెలుసు, యీనాడు రిక్షాను అమ్మితే, చెరొక రిక్షా కొనుక్కోలేమని, కిరాయి రిక్షా తీసుకుంటే యెంతోకష్టమని మునుపటిమాదిరిగానే, పగలల్లా ఒకడు, రాత్రిళ్లు ఒకడు వంతులు చప్పున రిక్షాలాగి సంపాదించుకుని తింటున్నారు. ఆ యిద్దరికీ అదిపరకు మాదిరిగానే, ఆరిక్షాయే జీవనాధారం.

మంగి వూహించినట్టుగానే, రాఘవుల సంపాదనతో, తనకొక చీరె అని, కొడుక్కి చొక్కా అని, భర్తకు ధోవతిఅని సంపాదించుకోకలిగింది. విడిగా వున్నతర్వాత, రాఘవులకు, మంగి అన్న మాట లన్నీ ఒక్కొక్కటీ అనుభవంలో కనిపిస్తున్నాయి.

కాలచక్రంతోపాటు, రిక్షాచక్రం రాలేక యెంతో వెనక్కుపడిపోయింది. ఆవూళ్లో సిటీబస్సులు వచ్చేసినాయి. మైలు వెళ్ళాలంటే, అణాయిస్తే, యిట్టే వెళ్ళిపోతారు. పావలాయిచ్చి, రిక్షాయెక్కే నాథుడు యెవరూ కనిపించటం లేదు. రిక్షాల గిరాకి చూస్తూ చూస్తుండగానే యిట్టే పడిపోయింది. తాము అదివరకు సంపాదించేదాంట్లో సగంకూడా రావటం లేదు. ఇంత సంపాదించినవాళ్ళం. ఓచిల్లర కొట్టుపెట్టుకున్నా, యీపాటికి మనజీవనానికి దిగులు లేకుండా పోయేది అనవసరంగా రిక్షాకొనుక్కుని యెందుకూ కొరగాకుండా పోయామే అని విచారపడుతున్నారు రిక్షా యజమానులు. ఈవచ్చిన కొత్తమార్పుతో, అన్నదమ్ము లిద్దరిమధ్య వైరుధ్యము పెరిగింది. ఎవరికివారు, ఆ రిక్షా తనసొత్తే కావాలనే పట్టుదలలో వున్నారు. ఎంత సేపటికి యిద్దరిమధ్య సమన్వయం కుదర్లేదు. వీరిద్దరూ యిట్లా మనస్పర్థలు పెంచుకుంటూనే వున్నారు. ఈ మధ్యలోనే యింకో వుపద్రవం వచ్చిపడింది. మ్యునిసి పాలటివారు, రిక్షాలను తోశేస్తున్నారనే పదంతి పుట్టింది. రిక్షా యజమానులు, రిక్షాలాగేవాళ్ళు, సభలు సమావేశాలు, జరిపి ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించారు. రిక్షాలను వుంచాలంటూ, కార్మికనాయకులు, పోయిన పలుకుబడిని వుపయోగించుకోవటానికి. యీ అవకాశాన్ని శాయశక్తులా వినియోగించుకున్నారు. ఎంత ఆందోళన జరిపినా, ఏమీ ప్రయోజనంలేక పోయింది. మ్యునిసిపాలిటీ వారు తమ సమావేశంలో రిక్షాలను తీసెయ్యాలని నిశ్చయించారు. ఈ

నిర్ణయం అమలు జరపంగానే, నీటినుంచి బైటపడవేసిన కప్పలులాగ, రిక్షాయజమానులు, రిక్షాలాగేవాళ్లు తన్నుకు పోయారు గిలగిల. అదివరకు సంపాదించిన సొమ్ము పెట్టుకొని కొంతమంది యజమానులు యింకోరకం వ్యాపారంలోకి దిగారు. రిక్షాలాగేవాళ్లు కూలీ, నాలీ చేసుకుని బ్రతుకు తున్నారు. అతికష్టంమీద, విడివిడి భాగాలుతీసి అమ్మితే, రాఘవులకు, సోముకు, తాముఖర్చుపెట్టిన సొమ్ములో మూడోవంతు వచ్చింది, రిక్షా అమ్మకంలో. ఆ డబ్బును చెరిసగం పంచుకోవటంలోకూడా తగాదాలుపడి చివరకు యెట్లాగోట్లా సద్దుబాటు చేసుకున్నారు. రిక్షాపోవటంతో, భుక్తి గడవటం యెంతో కష్టమైపోయింది. రెక్కలు విరుచుకున్నా, ముగ్గురి పిల్లల్ని, పోషించాలంటే, మంగికి, రాఘవులకు పెద్దసమస్య అయి పోయింది. సోము అదేస్థితిలోవున్నాడు. తన కుటుంబాన్ని పోషించే గత్యంతరంలేక, రాఘవులు, తనస్థలాన్ని, యింటిని అమ్ముకుని, యెక్కడో పూరిగుడిసెలో, నెలకు మూడు రూపాయలు అద్దెలో కాల క్షేపం చేస్తున్నాడు. సోము కూడా తప్పనిసరిగా తనయింటినికూడా అమ్మెయ్యాలిసివచ్చింది.

తనకొచ్చిన డబ్బుతో విశ్వప్రయత్నం చేశాడు యింకా డబ్బు సంపాదించాలని. చిన్న దుకాణం పెడితే, దాంట్లో నష్టంవచ్చింది, ఏపని చేస్తే, అపని తనకు యెదురయికూర్చుంది. రాఘవులకు తలకుమించిన పనయిపోయింది, ఎటూ తోచటంలేదు. మంగి, రెండుపూట్ల రెండిళ్ళకు వెళ్ళి బండచాకిరీ చేసివస్తుంది. తాను అక్కడా యిక్కడా తిరిగి, ఆపనీ, యీపనీ చేసుకుని యింటికి వస్తాడు రాఘవులు.

ఏ పూటకూలి, ఆ పూటకు గడవటానికే సరిపోవటంలేదు. సోముకు ఎక్కడలేని వోపికావచ్చింది. ఒక్కక్షణం కూర్చోకుండా ఏదో

పనిమీద వెళుతూనే వుంటాడు. రామి ప్రొద్దస్తమానం చాకిరి చేస్తూనే వుంటుంది. అప్పుడప్పుడు. వెనకటివన్నీ జ్ఞాపకంవచ్చి ఏడుస్తుంది, సోము, తాను తమ్ముణ్ణి అపార్థం చేసుకున్నానేమో అని బాధపడుతూ వుంటాడు. రాఘవులు చాలామంచివాడు. మంగి కూడా చాలామంచిదే. నేను తెలుసుకోలేకపోయాను. మొట్టమొదట తాను, తన తమ్ముడు ఈ వూళ్ళోకి వచ్చినప్పుడు ఎట్లావున్నారో జ్ఞాపకం తెచ్చుకుంటూ విచార పడతాడు. తన తమ్ముడి జాడ తనకు తెలియదు. ఈ వూళ్లో వున్నాడో లేదో కూడా తెలీదు. రాఘవుల్ని చూసి చాలా రోజులయింది. సోము దీర్ఘంగా ఆలోచించు కుంటున్నాడు.

రాఘవులు దిగాలుపడి అరుగుమీద కూర్చుని, కళ్లు తుడుచుకుంటు న్నాడు. తాను, తన అన్నతో పాటు ఈ వూరు వచ్చినప్పటినుంచి జరిగిన మార్పు లన్నీ గుర్తుకొస్తున్నాయి ఒక్కొక్క విషయమే తొలిచి తొలిచి రాఘవుల్ని బాధ పెటుతున్నాయి. మంగి చెప్పిన మాటలు విని అనవసరంగా అన్నతో విరోధము తెచ్చుకున్నాను. అన్న చాలా మంచివాడు. వదిన చాలా మంచిది. అన్నను చూసి యెన్నాళ్లయిందో మరి! ఎక్కడున్నాడో ఏంచేస్తున్నాడో! రాఘవులు సంక్షోభపడిపోతు న్నాడు. మంగి లోపల లోపల కుమిలిపోతోంది. సుఖపడదామనుకున్న రోజుల్లో మళ్ళీ కష్టాలు మొదలయినాయి. ఏ విధంగా జీవితం మళ్ళీ మారి పోతోందో చూచి బాధపడుతూంది. వెనకటిని తలుచుకుని విచార పడుతుంది. రాఘవులకు గాని, తనకు గాని వూపిరి సలపనంత పని. అయితే శ్రమకు తగినంత ఫలితం దొరకటంలేదు. తాను క్రుంగి పోతోంది, రాఘవులు చిక్కిపోతున్నాడు. ఏమి చెయ్యటానికి తోచటం లేదు.

ఎవరో బొంబాయినుంచి పెద్ద వ్యాపారులు వచ్చి, ఇక్కడకు మూడుమైళ్ల దూరంలో ఒక పెద్ద ఫ్యాక్టరీ కట్టబోతున్నారని ఆనోటా ఆనోటా విన వచ్చింది. ప్రతినోటా యీ మాటే వినిపిస్తోంది. రాఘవులు నిశ్చయించుకున్నాడు, ఆ ఫ్యాక్టరీ పూర్తి అయ్యేటంతవరకు అసలు మకాంయెత్తి, అక్కడే వుండిపోతే సరిపోతుందని.

తమ పోట్లల్ని చేతపట్టుకుని ఎక్కడెక్కడవాళ్లు అక్కడకు తయారయ్యారు. బ్రహ్మాండంగా పనులు సాగిపోతున్నాయి. చుట్టూ రకరకాలయిళ్ళు, ఆఫ్యాక్టరీ కట్టడం, చేతినిండా పని. దేనికీ వెతుక్కోనక్కర్లేదు. మంగి తలకు ఓ చుట్టచుట్టి, బయలుదేరుతుంది. రాఘవులు, పలుగు, పారపట్టుకుని బయలుదేరుతాడు. అణగారిన హృదయాల పునాదులమీద పైకి లేచిన భవనాలమాట గుర్తుకొచ్చి, తన గత చరిత్రను, గత ఆలోచనలను, స్ఫురణకు తెచ్చుకుంటున్నాడు రాఘవులు. వెకిలిగా తనలో తాను నవ్వుకుని, మనం యీ జన్మలో భాగ్యవంతులం కాలేము. భాగ్యవంతులు యింకా భాగ్యవంతు లవుతారు. బీద వాళ్ళు యింకా బీదవాళ్లవుతారు. వాళ్ళకు డబ్బుంది. మనకు రెక్కలు న్నాయి. మనం కష్టపడాలసినవాళ్ళం. అది తప్పదు. రాఘవులు యేమేమిటో ఆలోచించుకుంటూ, పనిచేసుకుని పోతున్నాడు.

ఎండ చుర్రుమంటోంది. సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చేశాడు. రాఘవులు స్వేదస్నానం చేస్తున్నాడు. ఎంతో నిబ్బరంగా, గుండె బరువుతో, పారతో లాగిన మట్టిని తట్టలోకి వేస్తున్నాడు. మంగి. ఆయాస పడుతూ, అక్కడే చతికిలపడిపోయింది; రొప్పుతోంది. ఒక్కసారిగా పైకిచూసింది. సూర్యకిరణాలు వాడిగా కళ్ళల్లోకి పొడుచుకు పోయినాయి. చప్పున కళ్ళు మూసుకుంది, రాఘవులు, తట్టనిండా

మట్టిని నింపేసి. పలుగును గట్టిగా భూమిలోకి దింపేసి, దాని ఆసరాతో అట్లాగే నిలబడిపోయాడు రొప్పుతూ. మేస్త్రి ఎక్కడ పసికట్టాడో ఏమో. చప్పున రాఘవుల వైపుకు గబగబా వస్తున్నాడు. మంగి చప్పున లేచి నిలబడి తట్ట నెత్తిన పెట్టుకుని చక చక నడిచింది. రాఘవులు భూమిలోకి గుచ్చిన పలుగును పైకి లాగాడు రౌంద్రంగా. మేస్త్రి, చూచీ చూడ కండా ఇంకో వైపుకు వెళ్లి పోయాడు, కూలీలు గుంపులు గుంపుగా వచ్చేస్తున్నారు. పని చురుకుగా సాగిపోతోంది. మేస్త్రి పంపించాడు గామాలు ఓ పదిమంది కూలీలు పలుగులు, పారలు పట్టుకుని, రాఘవు లున్న చోటుకు వచ్చేసి. భూమిని త్రవ్వేస్తున్నారు. పంగిన నడుము ఎత్త లేక అతికష్టం మీద. మట్టి తట్ట యింకోడి ఆసరాతో పైకెత్తి, తలమీద పెట్టబోయేసరికి, 'రాఘవులూ ...' అంటు గట్టిగా కౌగలించుకున్నాడు సోము — రాఘవులుకు కొద్ది క్షణాల దాక నోటినుంచి మాట పెగిలి రాలేదు.

అదుర్దాగా, మంగెక్కడ, పిల్ల లెక్కడ అంటూ సోము కుశల ప్రశ్నలు వేశాడు. రాఘవులుకూడా యెంతో ఆప్యాయంగా క్షేమసమాచారాలు అడిగి అన్నా! నేను పెద్ద తప్పు చేశాను, అంటూ కంట తడిపెట్టుకున్నాడు. సో ము, తమ్ముణ్ణి దగ్గరకు తీసుకుంటూ 'రాఘవులు ! నువ్వట్లా అనక' నెనూ చేశాను ... డబ్బున్నప్పుడు ఒకరి సుఖాల్ని చూసి ఒకరు ఓర్వలేక పోయినాము. డబ్బు పోయిన తర్వాత, ఒకరి కష్టాల్ని చూసి ఒకరు జాలి పడ వలసి వచ్చింది... మనకు మిగిలింది మన రెక్కలే! మధ్యలో వచ్చిన డబ్బు కాదు... మనం అన్నీ పంచుకున్నాం... కాని మన ప్రేమల్ని పంచుకో లేక పోయినాం... , ఇద్దరు అన్న దమ్ములు పెన వెసుకొని వెక్కి వెక్కి ఏడ్చారు.

దూరాన్నుంచి చూసిన మంగి. పరుగు పరుగున వచ్చి. బావా. అక్కెక్కడ! ... అంటూ బావురు మంది.

([illegible])